క్లుప్తంగా

సన్మానం



పాలకుర్తి: పాలకుర్తి మండలం వావిలాల గ్రామానికి చెందిన విద్యార్థిని షీలా వైష్ణవి జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, హెచ్ఎం ఆధ్వర్యంలో షీలా వైష్ణవి గురువారం డీఈఓ రమేశ్‌ను కలువగా ఆమెను సన్మానించి అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని డీసీసీబీ సెక్రటరీ చంద్రభాను, మహాత్మాహెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్, డాక్టర్ కల్నల్ భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, తీగారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌లు అభినందనలు తెలిపారు.

ఘనంగా హిందూ చైతన్య యాత్ర



స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్/చిల్పూరు: ధర్మ జాగరణ సమితి తెలంగాణ వారి ఆధ్వర్యంలో ఘన్‌పూర్ డివిజన్ కేంద్రం, జఫర్‌గఢ్, చిల్పూరు మండలం పల్లగుట్టలో గురువారం హిందూ చైతన్య రథయాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల నుంచి కూడళ్ల వరకూ ర్యాలీ తీశారు. ర్యాలీలో హిందూ సంఘాల నాయకులు పాల్గొని ధర్మజాగరణ సమితికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో హిందూ సంఘాల నాయకులు గోనెల రమేశ్, హేమంత్‌రాజ్, సదానందచారి, అందె వేణు, పుస్కురి సోమేశ్వర్, శ్రవణ్‌కుమార్, గందె సోమన్న, దాంశెట్టి సోమేశ్వర్, సత్యనారాయణ, వెంకటస్వామి, కేశోజు నిరంజన చారి, కవిత, రాజేశ్, ముక్కెర గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాయాత్ర



లింగాలఘణపురం: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్రలో భాగంగా గురువారం మండలంలోని నేలపోగుల, వనపర్తి, వడిచర్ల గ్రామాల్లో సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు గట్టగల్ల సంజీవ ఆధ్వర్యంలో కళాప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు రత్నం, గణేష్, కనక రాజు, శ్రీనివాసు, చందు, స్వప్న,పద్మ, రంజాన్‌బీ పాల్గొన్నారు.


నియామకం



యాకేష్‌పటేల్

కొడకండ్ల: మున్నూరు కాపు సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఏడునూతుల గ్రామానికి చెందిన కదారి యాకేష్‌పటేల్ నియామకమయ్యాడు. రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యపటేల్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సారంగపాణి, రాజులు యాకేష్‌పటేల్‌కు నియామక పత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

లూజ్ వైర్ల సమస్య పరిష్కారానికి చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

దేవరుప్పుల : మండల కేంద్రంలోని వాగులో లూజ్ వైర్లతో కూడిన విద్యుత్ సరఫరా లైన్ ప్రమాద నివారణకు సంబంధిత శాఖ అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. ఈ నెల 27న సాక్షి దినపత్రికలో 'ప్రమాదకరంగా విద్యుత్ లైన్' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. దేవరుప్పుల చెక్‌డ్యామ్, వంతెన మధ్య చెయ్యెత్తితే తగిలే లూజ్ వైర్ల ఏరియాలో పెద్ద స్తంభం వేశారు. విద్యుత్ శాఖ అధికారుల సత్వర చర్యల పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

దిగుబడి లేదు.. ధర రాదు

- ఎకరాకు 4 క్వింటాళ్లే..వచ్చింది
- నాణ్యత లేదని తక్కువ ధరకు పత్తి కొనుగోలు
- ఇంత నష్టాన్ని ఎన్నడూ చూడలేదంటున్న రైతులు



తమ్మడపల్లి (జి)లో దిగుబడి రాని పత్తి చేను



పత్తి చేను వద్ద రైతు అజయ్

జఫర్‌గఢ్: ఈ సారి పత్తి సాగు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఎంతో శ్రమకోర్చి వేలాది రూపాయాలు పెట్టుబడి పెట్టి పంటను సాగుచేస్తే చేసిన కష్టం, దిగుబడి ఏమో కాని కనీసం పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలు చేసింది. ఉన్న పంటకైనా మార్కెట్‌లో సరైన ధర లభిస్తుందనుకుంటే నాణ్యత లేదనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో ఎటూ పాలుపోని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామ యువ రైతు దొంతూరి అజయ్ తనకున్న భూమిలోని 5 ఎకరాల్లో వర్షాధారంపై పత్తి పంటను సాగు చేశాడు. పంట సాగు కోసం పలు రకాల కంపెనీల పత్తి సీడ్స్‌ను కొనుగోలు చేశాడు. గరుడ, వైరా, బాహుబలి-2, పంచముఖి విత్తనాలను సాగు చేశాడు. 5 ఎకరాల్లో సాగైన పత్తి పంటకు దుక్కులు దున్నిన నాటి నుంచి ఎరువులు, పురుగుల మందులు, కూలీలకు కలిపి ఎకరా సుమారు రూ.25 వేల పెట్టుబడులు పెట్టగా, మొత్తం రూ.లక్ష 25 వేల వరకు ఖర్చు చేశాడు. మొదట్లో పత్తి సాగు బాగానే కనిపించినప్పటికీ ఆ తర్వాత పంట కాతకు వచ్చే దశలో అకాల వర్షాలతో పాటు వాతవరణ పరిస్థితులతో తెగుళ్లు ఆశించిడంతో పాటు గూడ రాలిపోయింది. దీంతో ఒక్కో చెట్టుకు 15 నుంచి 25 కాయలు మాత్రమే కాసింది. వీటిలో కూడా కొన్ని కాయలు అకాల వర్షాలకు గుడ్డి పత్తిగా మారాయి. ఉన్న పంటను కూలీల ద్వారా తీయిస్తే ఒక్కో ఎకరాకు మూడున్నర నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఎన్నడూ లేని విధంగా పత్తిని తీసేందుకుకు ఒక్కో కూలీకి రూ.400 నుంచి 500 కూలి చెల్లించాల్సి వచ్చింది. ఉన్న పంటకైనా మార్కెట్‌లో ధర వస్తుంది అనుకుంటే నాణ్యతలేదనే సాకుతో క్వింటా పత్తికి రూ.6,500కు మాత్రమే కొనుగోలు చేశారు. వచ్చిన పైసలు కూలీలకే సరిపోతున్నాయని, పంట సాగు కోసం తెచ్చిన పెట్టుబడి డబ్బులు ఎక్కడి నుంచి తెవాలో అర్థంకావడం లేదని రైతు వాపోయాడు. ఈసారి రెండో క్రాప్ కూడా వచ్చేటట్లు కన్పించడం లేదని, పత్తి సాగు వల్ల తాను తీవ్రంగా నష్టపోయానని తన ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ పరిస్థితి ఒక్క రైతు దొంతూరి అజయ్‌ది కాదు ఏ రైతును కదలించినా ఇదే బాదను వ్యక్తం చేస్తున్నారు.

పూలే ఆశయ సాధనకు పాటుపడాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవేందర్



నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహాత్మా జ్యోతిరావుపూలే ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ బాధ్యతగా పాటుపడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాండ్ల దేవేందర్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే వర్థంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దేవేందర్ మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘం ఘన్‌పూర్ నియోజకవర్గ ఇంఛార్జీ గంటి ఉపేందర్, నాయకులు రమణ, శ్రీకాంత్, కుంభం కుమార్, రాజ్‌కుమార్, శ్రావణ్, అశోక్, రమేష్, సంపత్ పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి



నర్మెటలో..

నర్మెట: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థి సంఘం నాయకుడు ఎనుగుల వెలంగిణి ఆధ్వర్యంలో మండలకేంద్రం చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పల్లె ప్రభుదాస్, గద్దల కిషోర్, ప్రజ్ఞాపురం శ్రీధర్, పసునూరి రాజు, గడ్డం సురేష్, కంతి చరణ్, చుంచు రాజు, చెవుల పరశురాములు, మహేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నిండిన ట్యాంకులు.. తడిసిన ధాన్యం

- సిబ్బంది నిర్లక్ష్యంపై రైతుల ఆగ్రహం



నీటితో నిండిన కొనుగోలు కేంద్రం

చిల్పూరు: ఒక్కరోజు గడిస్తే ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తూకం వేసిన సన్న రకం ధాన్యం తరలిపోయేది. రాత్రి బస్తాలపై కవర్లు కప్పి ఇళ్లకు వెళ్లిపోయారు. ఉదయం వచ్చే సరికి ధాన్యం నీటిలో మునిగి కనిపించింది. ఆందోళనకు గురైన రైతులు చుట్టు పక్కల వారి సహాయంతో తడిసిన ధాన్యాన్ని తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి తాగునీరు వచ్చే మిషన్ భగీరథ గేట్‌వాల్వు నాలుగు రోజుల క్రితం రిపేరుకు రావడంతో నీటి సరఫరా ఆగి పోయింది. బుధవారం సాయంత్రం ఏఈ కోటి వచ్చి రిపేరు చేసి ట్యాంకుల్లోకి నీరు వదిలి వెళ్లారు. అనంతరం జీపీ సిబ్బంది పట్టించుకోక పోవడంతో ట్యాంకులు నిండిపోయి నీరు పక్కనే ఉన్న ఐకేపీ కొనుగోలు కేంద్రానికి చేరింది. గురువారం ఉదయం 5 గంటలకు ఒక రైతు గమనించి జీపీ సిబ్బందికి తెలపడంతో వారు వచ్చి గేట్‌వాల్వు ఆఫ్ చేశారు. అప్పటికే కొనుగోలు కేంద్రంలోని 8 మంది రైతులకు చెందిన 300 బస్తాల సన్న రకం ధాన్యం తడిసి పోయింది. భగీరథ, జీపీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ ధాన్యం తడిసి పోయిందని రైతులు శ్రీనివాస్, రవీందర్, లింగయ్య, రాజయ్య, వీరస్వామి, కుమారస్వామి ఆరోపించారు.

సంబురాలను ఘనంగా జరుపుకోవాలి

బచ్చన్నపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా నిర్వహించే సంబురాలను ఘనంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని గ్యారంటీలను అమలు చేస్తున్నారని తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

చిల్పూరు: ఈనెల 29న(శుక్రవారం) చేపట్టనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ మాలోత్ రమేశ్‌నాయక్ అధ్యక్షతన గురువారం దీక్షా దివాస్ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. నేడు జిల్లా కేంద్రంలో నిర్వహించే దీక్ష దివాస్ కార్యక్రమానికి 5 మండలాల నుంచి వెయ్యి మంది కార్యకర్తలు తరలిరావాలని అన్నారు. ఇల్లందుల వెంకటస్వామి, అరూరి స్వామి, అరూరి రవిచంద్ర, ఎడ్ల యాకయ్య పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

- మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ లావణ్య



మాట్లాడుతున్న లావణ్యరెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతుల పక్షపాతిగా పనిచేస్తున్నారని ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ ఛైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 30న సాయంత్రం 4 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో జరిగే రైతుల పండుగ మహాసభకు రైతులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆమె కోరారు.మార్కెట్ వైస్ ఛైర్మన్ నూకల ఐలయ్య, కార్యదర్శి భాస్కర్, మార్కెట్ డైరెక్టర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రైతు పండుగను విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి కరుణాకర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద గురువారం రైతు పండుగ నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓలతో పాటు రైతులు పాల్గొన్నారు. కాగా, మండలానికి వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్‌రెడ్డిని మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య ఆధ్వర్యంలో రైతులు సన్మానించారు.

ఆర్టీసీ డిపోలో వనభోజనాలు



అతిథులను సత్కరిస్తున్న డిపో మేనేజర్ స్వాతి

జనగామ: ఆర్టీసీ జనగామ డిపోలో గురువారం డీఎం ఎస్.స్వాతి ఆధ్వర్యాన సామూహిక కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను, వరంగల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్ హాజరయ్యారు. ఉద్యోగులకు మ్యూజికల్ చైర్, సింగింగ్, డ్యాన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఈ ఏడాది అక్టోబర్‌లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

క్రీడా దుస్తుల పంపిణీ



లింగాలఘణపురం: మండలంలోని నాగారం యుపీఎస్‌లో స్థానిక పాఠశాల ఉపాధ్యాయురాలు స్నేహలత 36 మంది విద్యార్థులకు సుమారు రూ.10 విలువైన క్రీడా దుస్తులను అందజేయగా గురువారం ఎంఈఓ విష్ణుమూర్తి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాదవీలత,ఏపీసీ చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మాధవి, రజినీ, సాగర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న రవీందర్

జనగామ రూరల్: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో ఇటీవల నిర్వహించిన అండర్-19 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన వీరారెడ్డి కాంస్య పతకం సాధించగా, మహ్మద్ యునిస్ రజిథా రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో కార్యక్రమం ఏర్పాటు చేసి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి బి. రవీందర్, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ బాబు. కోఆర్డినేటర్ ఐ. వీరస్వామి పి.డి. రాజు వార్డెన్ సల్మాన్ అధ్యాపక బృందం వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- సీఐ వేణు



మాట్లాడుతున్న సీఐ వేణు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ జి.వేణు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, వ్యక్తిత్వవికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు గురి కావొద్దని, చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు సూచనల మేరకు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతస్థానాలకు చేరుకోవాలన్నారు.

రక్తహీనతతో అనర్థాలు

- డాక్టర్ రజనీకాంత్



అవగాహన కల్పిస్తున్న రజనీకాంత్

దేవరుప్పుల: రక్తహీనతతో అనేక అనర్థాల బారిన పడుతారని ఆర్‌బీఎస్‌కే వైద్యులు రజనీకాంత్ సూచించారు. గురువారం మండలంలోని సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం అంబటి అంజయ్య అధ్యక్షతన ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి బాలబాలికలకు రక్త పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. నిత్యం రక్త ఉత్పత్తి పొందే ఆకుకూరలు తీసుకునేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వనజ, ఉపాధ్యాయులు సుచిత్రానంద్, చైతన్య, సునీత పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవి



జనగామ రూరల్: మాట్లాడుతున్న రవి

జనగామ రూరల్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పంగ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పంగ రవి హాజరై మాట్లాడారు. 5 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా రమేష్, కార్యదర్శిగా ఎం.రాజులతోపాటు ముగ్గురు కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో హరీశ్, ,క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



రఘునాథపల్లి: రాస్తారోకో చేస్తున్న నాయకులు

రఘునాథపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం రఘునాథపల్లి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. రహదారిపై బైఠాయించి ఫుడ్ పాయిజన్ కేసులు వెలుగుచూస్తున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో పోలీసులు బుజ్జగించి రాస్తారోకో విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పాదల లవకుమార్, మామిడాల రమేష్, కందుకూరి రమేష్, మాలి, సాయి, ఆర్య, నిషిత, సమంత పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం



జనగామ రూరల్: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జనగామ రూరల్: గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక అస్వస్థతకు గురవడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలో దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ హృతిక్ సాయి మాట్లాడుతూ గురుకులాల్లో ఫుడ్‌పాయిజన్‌తో ఎందరో విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుంటుపల్లి కార్తీక్, దేవులపల్లి నితీష్, వంశీ, మహేందర్, రోహిత్ పాల్గొన్నారు.

విద్యార్థులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ పార్క్ వద్ద విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటనపై నిరసన తెలియజేశారు. రమేశ్, ఆర్య, అమ్రాన్, సోహెల్, కావ్య పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలి

- సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: పట్టణంలో ఐఎస్ఐ అనుమతి లేని వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోగు ప్రకాష్, బూడిది గోపి మాట్లాడుతూ ప్రైవేట్ వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోకపోతే పది రోజుల్లో పట్టణ ప్రజలను చైతన్యం చేసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్యాణం లింగం, పందిళ్ళ కళ్యాణి, బోట్ల శ్రావణ్, పగిడిపల్లి బాలమణి, పాము శ్రీకాంత్, బండ సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హామీలు నెరవేర్చాలి

జఫర్‌గఢ్: ప్రజా పాలన అంటే సంబురాలే కాదని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తమ్మడపల్లి (జి) గ్రామంలో సీపీఎం గ్రామ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రాపర్తి సోమయ్య, గుండెబోయిన రాజు, వడ్లకొండ సుధాకర్, ముక్కెర రాజు, వడ్లకొండ రాజు, వేల్పుల పెద్ద రాములు పాల్గొన్నారు.

పరామర్శ

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మినుకూరి అహల్యాదేవి, పెంతల రాధమ్మ కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్టీ బృందంతో కలిసి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మహేందర్‌రెడ్డి, సోమిరెడ్డి, రాజ్‌కుమార్ ఉన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన వ్యాపారి బిట్ల దామోదర్ మృతి చెందాడు. కాగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పార్టీల నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండుకృష్ణ, పులిగిళ్ల వెంకన్న, ఉప్పుల ఉప్పలయ్య, ఏల సోమసుందర్, ఎల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో కృత్యమేళా



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో సాంఘిక శాస్త్రం కృత్యమేళా కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. పాఠశాల సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు కృష్ణవేణి, రజిని, రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో తయారు చేసిన ఎగ్జిబిట్లను కృత్యమేళాలో ప్రదర్శించారు. మొత్తంగా 52 కృత్యాలను ప్రదర్శించగా పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.రమేష్ మాట్లాడారు. చదవడంతో పాటు కృత్యాల ద్వారా పాఠ్యాంశాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, శ్రీనాథ్, శ్రీనికాంత్, కృష్ణవేణి, ఫకీర్‌దాసు, శ్రీదేవి, రజని, రమేష్, వసంతకుమారి, లక్ష్మీప్రసాద్, యాదగిరి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

డబ్బులడిగితే సమాచారం ఇవ్వండి

కొడకండ్ల: మండలంలో వ్యవసాయ కనెక్షన్ల కోసం విద్యుత్ అధికారులు, సిబ్బంది డబ్బులడిగితే వెంటనే 1912 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని స్టేషన్ ఘన్‌పూర్ డీఈ రాంబాబు కోరారు. డివిజన్ పరిధిలోని కొడకండ్ల మండలంలో 39 దరఖాస్తులకు గాను కొత్తగా వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉన్నందున త్వరితగతిన పనులు చేసి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళికను రూపొందించామని, అందుకనుగుణంగా పనులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

బచ్చన్నపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అన్నారు. గురువారం మండలంలోని లింగంపల్లి శివారు గ్రామమైన పుల్లగూడలో పార్టీ ప్రజా పోరాటాలకు ఆకర్షితులైన 20 కుటుంబాల సభ్యులు సీపీఎంలో చేరారు. వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి వెంకటేశ్ మాట్లాడారు. నాయకులు బండకింది బాల్‌నారాయణ, జంగ పోషయ్య, తాడూరి వెంకటమ్మ, కుమార్, పొన్నాల రాజమ్మ, జయమ్మ, గుండమ్మ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.